అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి

చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలింపు



జవహర్‌నగర్: అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ వేంకటేశ్వర దేవాలయం కమాన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కిందపడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా.. అతడికి ఫిట్స్ వచ్చిందని గ్రహించి, వెంటనే 108లో గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సదరు వ్యక్తి 24–30 ఏళ్లు ఉంటాయిని, వివరాలు తెలిసిన వారు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

కుషాయిగూడ: యాంటీ డ్రగ్స్ సోల్జర్స్, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ విభాగం సహకారంతో హెచ్‌బీకాలనీలోని వసుంధర డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ సభ్యులు మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోద్దన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ సభ్యులు మోహన్ పాటిల్, సీహెచ్.ముక్కంటి, శ్రీశైలం మరాఠి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని మాదిగ రీసెర్చ్ స్కాలర్స్ స్టూడెంట్స్ ఐక్య వేదిక కన్వీనర్ వలిగొండ నరసింహా ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. జగ్జీవన్‌రామ్ నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీకి సాంప్రదాయ ఓటు బ్యాంక్‌గా మాదిగలు ఉన్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలను విస్మరించినందునే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారని తెలిపారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: క్రైస్తవులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని సామాజిక విప్లవకారుడు డా.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఏపీలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దాడులను ప్రేరేపించే సంస్థలపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్న పాస్టర్లను మత ప్రచారకులుగా ముద్ర వేసి దుషించడం తగదని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై విమర్శలు తగవు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ జాగృతి అధినేత్రి, ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నేతల విమర్శలు చేయడం తగదని ఓయూ జేఏసీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు డాక్టర్ కందుల మధు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ బిల్లుపై పోరాడిన కవితను ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించడం సిగ్గు చేటు అన్నారు. వెంటనే అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఏబీవీపీ నాయకులపై లాఠీచార్జి తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ భూముల వేలాన్ని అడ్డుకున్న ఏబీవీపీ నాయకులు, ఇతర విద్యార్థులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నగర కార్యదర్శి పృథ్వీతేజ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60 ఏండ్లుగా ఎంతోమంది విద్యావంతులను అందించిన హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను కార్పొరేట్ శక్తులకు విక్రయించాలనుకోవడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం వర్సిటీల భూములు అమ్మడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బన్సీలాల్‌పేట్: టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంస్థ మేనేజర్ మాల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిలైన వారు 18 నుంచి 27 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ట్యాలీ జీఎస్టీ, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్. కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, టైపింగ్, ఇంటర్నెట్ కాన్సెప్ట్‌ల్లో 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న భోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీహాల్‌లోని అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9154990133, 8498089786.



బీరప్ప దేవాలయంలో..



అన్నోజిగూడలో..

ఉగాది పర్వదినం.. షడ్రుచుల సమ్మేళనం

మేడ్చల్ నియోజకవర్గంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పంచాంగ శ్రవణంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పంచాంగం వినడానికి భక్తులు పెద్ద ఎత్తున సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి తరలివచ్చారు. ప్రజలు వారి ఇళ్లలో పూజలు చేసి ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. పలు ఆలయాల్లో స్వామివారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. పచ్చని తోరణాలతో ఇంటి గుమ్మాలు కనువిందు చేస్తున్నాయి.

– మేడ్చల్ జోన్ బృందం



గుండ్లపోచంపల్లి ఉగాది వేడుకల్లో నాయకులు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రమేష్‌గుప్తా



శ్రీ రంగవరం గ్రామంలో..



చీర్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పచ్చడి కుండతో ఆలయ ఫౌండర్ లక్ష్మీనారాయణ



నాగారంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు



మేడ్చల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావు



మేడ్చల్ ఆర్టీసీ బస్‌డిపోలో..



ఏదులాబాద్‌లో..

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీత ఆధ్వర్యంలో సాయినగర్ చౌరస్తా, గౌతంనగర్ చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మేకల రాముయాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం



భార్గవి

జవహర్‌నగర్: ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కల అభిషేక్, సోదరి భార్గవి (18)తో కలిసి బాలాజీనగర్‌లోని అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నారు. భార్గవి ఈనెల 28న పరీక్షలకు కొన్ని పత్రాలు కొనడానికి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె సోదరుడు అభిషేక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ

లాలాపేట: తార్నాక చింతల్‌బస్తీ నాయకులు బస్తీలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత బహుజనులను జాగృతం చేసేందుకే ప్రతి వారం ఈ జ్ఞానమాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో దళిత సామాజిక వర్గంలోని యువత ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో తుంగ లక్ష్మణ్, చిన్న, మనోహర్, ప్రసన్న తదితరులు ఉన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థుల అరెస్టు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడులు, అరెస్టుల అన్యాయమని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎస్ నాగేశ్వర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించడాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రూ.55.01 కోట్ల పన్ను వసూళ్లు

- టార్గెట్‌కు మించి వసూళ్లు
- నేడు అర్ధరాత్రి వరకు కౌంటర్లు

కుత్బుల్లాపూర్: పన్నుల వసూలు చేసే విషయంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు రెండు రోజుల ముందుగానే టార్గెట్ పూర్తి చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.54.36 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకోగా.. ఈనెల 29వ తేదీ నాటికి రూ.55.01 కోట్లు వసూలు కావడం విశేషం. నెల రోజులుగా ప్రతి రోజు టార్గెట్ పెట్టుకొని ముందుకు సాగిన ఉప కమిషనర్ నరసింహ ఎట్టకేలకు టార్గెట్ పూర్తి చేయడంతో పాటు మరో ఐదు కోట్ల రూపాయలు అదనంగా వసూలు చేసేందుకు కృషి చేస్తున్నారు. గతంలో సైతం కుత్బుల్లాపూర్ సర్కిల్ గ్రేటర్ పరిధిలోని ఇంటి పన్ను వసూళ్ల విషయంపై మొదటి స్థానంలో ఉండగా.. తాజాగా గ్రేటర్ పరిధిలో ముందు వరుసలో ఉండే అవకాశం ఉంది. సమిష్టి కృషి వల్లే ఈ వసూళ్లు చేయడం జరిగిందని, ప్రజలు సైతం ముందుకు వచ్చి పన్నులు చెల్లించేందుకు సిద్ధం కావడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామని ఉప కమిషనర్ నరసింహ తెలిపారు.

నేటి అర్ధరాత్రి వరకు ప్రత్యేక కౌంటర్లు

జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం రాత్రి 12 గంటల వరకు ఆస్తి పన్ను చెల్లింపు విషయంపై ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిల్ ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డిలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు సెలవుల్లో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా పన్నులు చెల్లించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయి చెల్లింపు విషయంపై ఓటీఎస్ పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ పథకం ద్వారా వడ్డీలో 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బహుజనుల సమీకరణతోనే రాజ్యాధికారం



ఘట్‌కేసర్: బహుజనుల సమీకరణతోనే రాజ్యాధికారం సాధ్యమని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిత్యమాల కార్యక్రమం నిర్వాహకుడు ప్రదీప్‌గౌడ్, ప్రబుద్ధ భారత్ ఇన్‌చార్జ్ అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. మహనీయుల చరిత్రను నేటి యువత తెలుసుకోవాలని సూచించారు. దాసు, నర్సింగ్ రావు, రాందాసు, రామలింగేశ్వర్, శ్రీనివాస్, సత్యం, ఆనంద్, వెంకటేశ్వర్లు, జగదీశ్, శ్రీరామ్, గణేష్, కృష్ణంరాజు, నిఖిల్, విష్ణు, సాయిచరణ్, లిఖిత్ ప్రసాద్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తేనే పన్నులు కడతాం

పోచారం: మౌలిక వసతులు కల్పించకుండా ఆస్తి పన్ను కట్టాలని పోచారం మున్సిపాలిటీ అధికారులు కోరుతున్నారని భవన యజమాని శ్రీనివాస రావు ఆరోపించారు. పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్ వద్ద స్టార్ పీజీ హాస్టల్ కొనసాగుతోంది. గత రెండేళ్లుగా ఆస్తిపన్ను బకాయిలు ఉండటంతో వసూలు చేసేందుకు మున్సిపల్ బిల్ కలెక్టర్లు వచ్చారు. ఆస్తి పన్ను చెల్లించనందుకు భవనానికి తాళాలు వేస్తామని, హాస్టల్‌లో ఉంటున్న వారు ఖాళీ చేయాలని మున్సిపల్ సిబ్బంది చెప్పారు. దీనికి భవన యజమాని స్పందిస్తూ.. డ్రైనేజీ, నీటిసరఫరా, వీధిదీపాలు, రోడ్లు వంటి వసతులు కల్పించకుండా పన్నులు చెల్లించాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీ నుంచి ఎలాంటి వసతులు కల్పించకుండా పన్నులు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. కనీసం చెత్త సేకరణ వాహనాన్ని తమ ప్రాంతం వైపు పంపడం లేదని వాపోయారు. పన్నులు చెల్లిస్తామని, మౌలిక వసతుల కల్పనపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిబ్బంది హామీ ఇవ్వడంతో రూ.1.76 లక్షల ఆస్తిపన్నును శ్రీనివాస్ చెల్లించారు.



బకాయిదారులపై ఒత్తిడి చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మాస్టర్ నానికి వరల్డ్ కరాటే ఫెడరేషన్ బ్లాక్ బెల్ట్

అల్వాల్: మాస్టర్ నాని పులగరకు ప్రతిష్టాత్మక వరల్డ్ కరాటే ఫెడరేషన్ (డబ్ల్యూకేఎఫ్) 5వ డాన్ బ్లాక్ బెల్ట్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ) నేషనల్ వేదికపై తెలంగాణ స్పోర్ట్స్ కరాటే–డో అసోసియేషన్ అధ్యక్షులు, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షులు భరత్‌శర్మ చేతులమీదుగా మాస్టర్ నానికి అవార్డును అందజేశారు. మాస్టర్ నాని పులగరకు ఈ అవార్డు రావడంపై తెలంగాణ కరాటే అసోసియేషన్, పలువురు మాస్టర్లు అభినందించారు.



అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

రోగులకు పండ్ల పంపిణీ

రామంతాపూర్ : బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ హోమియో ఆసుపత్రిలో బీజేపీ నేతలు రోగులకు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా, రేవు నరసింహ, సాగర్, రవీందర్, అంజయ్య పటేల్, రవి, దయాకర్‌రెడ్డి, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాత్సల్య సింధు ఆశ్రమంలో అన్నదానం

కుషాయిగూడ: మీర్‌పేట–హెచ్‌బీకాలనీ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రామ్‌ప్రదీప్ మునుగంటి ఆధ్వర్యంలో వాత్సల్య సింధు ఆశ్రమంలో పిల్లలకు అన్నదానం నిర్వహించి చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బ్రహ్మాచారి, జిల్లా నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు చారిత్రాత్మక ఈద్గా ముస్తాబు

కాప్రా: రంజాన్ వేడుకలకు చారిత్రాత్మక కాప్రా ఈద్గా ముస్తాబయ్యింది. సోమవారం (నేడు) ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు పెద్దసంఖ్యలో ముస్లింలు వచ్చే అవకాశం ఉండడంతో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. కుతుబ్‌షాహీల పాలనలో 1610లో ఈద్గా నిర్మాణం కాగా, దాదాపు 410 ఏళ్లకు పైగా చరిత్ర దీనికి ఉన్నది. కొన్నేళ్ల క్రితం ఈద్గా శిథిలావస్థకు చేరుకోవడంతో 2004లో పునః నిర్మించారు. ఏటా ఇక్కడ రంజాన్, బక్రీద్ రోజున ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం

- 30 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా ప్రణాళిక
- ధాన్యం కొనుగోళ్లకు 12 కేంద్రాల ఏర్పాటు

సాక్షి,సిటీబ్యూరో: యాసంగిలో రైతు పండించిన వరి ధాన్యమంతా కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఏప్రిల్‌లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటోంది. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

పెరిగిన వరి సాగు..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా.. రైతులు మాత్రం 11,015 ఎకరాల్లో వరి పంట వేశారు. దీంతో వరి దిగుబడి 33 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

కేంద్రం ప్రకటించిన ధరతోనే కొనుగోలు..

రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ధాన్యం సేకరణలో భాగంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు.



అన్ని రకాల సౌకర్యాలు..

టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాముల్లోకి తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఎండలు మండుతుండటంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేసినప్పటికీ, అదనంగా 1.30 లక్షల గన్నీ బ్యాగులను రైతులకు అందుబాటులో ఉంచారు.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఏదులాబాద్, మాదారం (ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి (మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్, డబుల్‌పురా, పూడూరు (మేడ్చల్ మండలం), శామీర్‌పేట్, అలియాబాద్, కీసర మండల కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

యాసంగి ధాన్యమంతా కొంటాం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని 12 కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు సంబంధిత అధికారులు, రైతు ప్రతినిధులు, హమాలీలు, రైస్ మిల్లర్లతో ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించాలి.

– సుగుణబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్